సాక్షి అనంతపురం

బుధవారం । 8 । ఫిబ్రవరి । 2023



చీనీ టన్ను రూ.30 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.30 వేలు పలికాయి.



టమాట కిలో రూ.16

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.16, కనిష్టం రూ.4, సరాసరి రూ.10 పలికింది.

గరిష్టం/కనిష్టం

36.9°/ 16.1°

జిల్లా అంతటా మంగళవారం పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. వేకువజామున చలి వాతావరణం కొనసాగింది. ఆగ్నేయ దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

380 పంచాయతీల్లో 'గడప గడప' పూర్తి



మాట్లాడుతున్న సీపీఓ ప్రేమ్‌చంద్ర

కళ్యాణదుర్గం రూరల్: జిల్లా వ్యాప్తంగా 380 గ్రామ పంచాయతీల్లో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం పూర్తయ్యిందని ముఖ్య ప్రణాళిక అధికారి (సీపీఓ) ప్రేమ్‌చంద్ర చెప్పారు. కళ్యాణదుర్గం మండలం బోరంపల్లి సచివాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. సచివాలయ సేవల గురించి సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 661 సచివాలయాలు ఉండగా, 380 సచివాలయ పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయ్యిందన్నారు. ఆయా సచివాలయాల్లో ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున రూ.135.60కోట్లు కేటాయించామన్నారు. ఇందులో 1508 అభివృద్ధి పనులకు రూ.49.12కోట్ల నిధులు మంజూరు చేశామన్నారు. సచివాలయాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా 8 పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. బాలికలు, గర్భిణుల్లో రక్తహీనత, స్కూల్, వసతి గృహాల విద్యార్థుల సంక్షేమం, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల వయస్సుకు తగ్గ ఎత్తు, బరువు, డ్రాపౌట్స్, మౌలిక వసతుల కల్పనపై నిత్యం సమీక్షిస్తున్నామన్నారు.

వాల్మీకి, బోయలను ఎస్టీల్లో చేర్చండి

అనంతపురం సప్తగిరి సర్కిల్: వాల్మీకి, బోయలను ఎస్టీల్లో చేర్చాలని అనంతపురం ఎంపీ తలారి రంగయ్య కేంద్రాన్ని కోరారు. మంగళవారం పార్లమెంటు సమావేశంలో ఆయన బోయ, వాల్మీకి స్థితిగతుల గురించి ప్రస్తావించారు. ఇటీవల రామ మందిరం సమస్యను తీర్చిన కేంద్ర ప్రభుత్వం.. వాల్మీకి, బోయలను ఎస్టీలుగా గుర్తించి న్యాయం చేయాలని కోరారు. రాముడు దేవుడయ్యాడంటే కారణం వాల్మీకి రచించిన రామాయణం వల్లే సాధ్యమైందని గుర్తు చేశారు.

ఈ-క్రాప్, ఈ-కేవైసీ తప్పనిసరి



కౌలు రైతులకు సాగు హక్కుపత్రాలు పంపిణీ చేస్తున్న డీఏఓ

పామిడి: రబీలో పంటలు సాగు చేసిన రైతులకు ఈ-క్రాప్, ఈ-కేవైసీని తప్పనిసరిగా చేయించాల్సిన బాధ్యత రైతు భరోసా కేంద్రాలదేనని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) చంద్రానాయక్ అన్నారు. మంగళవారం పామిడి మండలం ఖాదర్‌పేట, అనుంపల్లి గ్రామాల్లోని వేరుశనగ పొలాల్లో నిర్వహిస్తున్న ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. అనుంపల్లిలో వరిమడిని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రైతు భరోసా కేంద్రంలో డీఏఓ సమక్షంలో వైస్ ఎంపీపీ మహేష్, సర్పంచ్ నారాయణస్వామి చేతుల మీదుగా కౌలు రైతులకు సాగు హక్కు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ డీ లీనా వసుంధర, ఏఈఓలు శ్రీనివాసరావు, శివరాజు, వీఎస్‌ఏ నారాయణస్వామి, వీఏఏ గీతావాణి, రైతులు బయపరెడ్డి, దామోదర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

నెట్టికంటుడి హుండీ ఆదాయం రూ.44.59 లక్షలు



హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో హుండీ కానుకల లెక్కింపు ద్వారా రూ. 44.59 లక్షల ఆదాయం సమకూరింది. ఈ మేరకు ఆలయ ఈఓ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు చేపట్టారు. 59 రోజులకు గానూ రూ.44,59,886 నగదు, అన్నదానం హుండీ ద్వారా రూ.59,084 నగదు సమకూరింది. దీంతో పాటు 0.001 గ్రాముల బంగారు, 1.490 కిలోల వెండిని కానుకల రూపంలో భక్తులు స్వామివారికి సమర్పించినట్లు తెలిపారు. ఆలయ పాలకమండలి చైర్మన్ సుగుణమ్మ, ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

- సామాజిక మాధ్యమాలే వేదిక
- ముక్కూమొహం తెలీని వారితో స్నేహం
- ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ ఖాతాలతో చాటింగ్
- మాయమాటలతో ముగ్గులోకి దించుతున్న అబ్బాయిలు
- ఏడాదిలోనే మోసపోయిన 71 మంది అమ్మాయిలు

- అనంతపురంలోని పాతూరుకు చెందిన స్వాతి (పేరు మార్చాం) ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన బెంగళూరుకు చెందిన అబ్బాయి వలలో పడింది. ఉన్నఫళంగా ఒకరోజు ఇంటినుంచి వెళ్లిపోయింది. తల్లిదండ్రులు 'దిశ' పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. చివరకు పోలీసుల జోక్యంతో అమ్మాయిని వెతికి ఇంటికి తెచ్చారు.
- ధర్మవరానికి చెందిన అమ్మాయి కావ్య (పేరు మార్చాం) అనంతపురంలో డిగ్రీ ఫస్టియర్ చదువుతోంది. ఒకరోజు ఉన్నఫళంగా అబ్బాయితో వెళ్లిపోయింది. ఇరవై రోజుల తర్వాత ఫోన్ కాల్స్ ఆధారంగా కనుక్కొని అమ్మాయిని తీసుకొచ్చారు. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమైన అబ్బాయితో వెళ్లిపోయినట్టు విచారణలో తేలింది.

వీరిద్దరే కాదు ఎంతోమంది స్మార్ట్‌ఫోన్లలో సామాజిక మాధ్యమాల ద్వారా ముక్కూమొహం తెలీని వ్యక్తులు విసిరిన వలలో చిక్కుకుని మోసపోతున్నారు.



వంచనకు పరిచయం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లు వినియోగిస్తున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. స్మార్ట్ ఫోన్ ఉందంటే చాలు కచ్చితంగా తమ పేరుపై ఖాతాలు తెరిచేస్తున్నారు. ప్రతిదీ అందులో షేర్ చేసుకుంటున్నారు. అలాంటి సామాజిక మాధ్యమాల ద్వారా ఎక్కడెక్కడి వారో పరిచయమవుతున్నారు. అలా చాటింగ్‌తో స్నేహం పెంచుకుంటున్నారు. ప్రత్యక్షంగా వారిని చూడకపోయినా.. వారి గుణగణాలు, నేపథ్యం తెలియకపోయినా గుడ్డిగా నమ్ముతున్నారు. ఇటువంటి తరుణంలో అమ్మాయిలను కొందరు అబ్బాయిలు ట్రాప్‌లో పడేస్తున్నారు. క్రమక్రమంగా అమ్మాయిలు తమ కెరీర్‌ను పక్కన పెట్టి పోకిరీల చేతిలో మోసపోతున్నారు. తాజాగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇలాంటి మాధ్యమాల ద్వారా నష్టపోతున్న అమ్మాయిల సంఖ్య గణనీయంగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది.

కొంపముంచుతున్న ఇన్‌స్టాగ్రామ్

ఇటీవలి కాలంలో ఇంటర్ చదువుతున్న అమ్మాయిలకు తల్లిదండ్రులు స్మార్ట్ ఫోన్ కొనిస్తున్నారు. కోవిడ్ సమయంలో ఆన్‌లైన్ క్లాసులంటూ పరిచయమైన ఈ ఫోన్‌లు ఇప్పుడు పర్సనల్ ఖాతాల వరకూ వెళ్లాయి.

అనంతపురం జిల్లాలో ఇంటర్మీడియెట్ విద్యార్థులు

తరగతి	బాలురు	బాలికలు
ఫస్టియర్	9,960	9,193
సెకండియర్	12,147	11,211
మొత్తం	19,153	23,558

శ్రీసత్యసాయి జిల్లాలో ఇంటర్మీడియెట్ విద్యార్థులు

తరగతి	బాలురు	బాలికలు
ఫస్టియర్	4,911	4,533
సెకండియర్	7,032	6,492
మొత్తం	9,444	13,524

ప్రతి అమ్మాయి.. అబ్బాయి ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌ల ద్వారా చాటింగ్ చేస్తున్నారు. ఎవరితో మాట్లాడుతున్నాం, ఎందుకు మాట్లాడుతున్నామన్న కనీస అవగాహన కూడా లేకుండా అబ్బాయిలకు వ్యక్తిగత వివరాలు షేర్ చేస్తున్నట్టు వెల్లడైంది. దీన్ని కొందరు అబ్బాయిలు అడ్డుపెట్టుకుని బ్లాక్‌మెయిల్‌కు దిగుతున్నారు. అమ్మాయిలు నష్టపోయే వరకూ వాస్తవ విషయాన్ని తెలుసుకోలేకపోతున్నారు. అమ్మాయిలు నష్టపోయాక విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు వారిని చదువు మాన్పిస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. ఏడాది వ్యవధిలో 71 మంది అమ్మాయిలు ఇలా సామాజిక మాధ్యమాల ద్వారా అబ్బాయిల వలలో పడినట్టు తేలింది.

బాధితుల్లో అమ్మాయిలే ఎక్కువ



సామాజిక మాధ్యమాల బాధితుల్లో ఎక్కువగా అమ్మాయిలే ఉన్నారు. ఇన్‌స్టాగ్రామ్ పరిచయాలు ఎక్కువయ్యాయి. నెలకు ఐదారు కేసులు వస్తున్నాయి. తల్లిదండ్రుల కోరిక మేరకు వివరాలు గోప్యంగా ఉంచి అబ్బాయిలను మందలించి పంపిస్తున్నాం. పరిచయం లేని వ్యక్తితో చాటింగ్ చేయొద్దు. వ్యక్తిగత, కుటుంబ వివరాలు షేర్ చేయద్దు.

–ఆళ్ల శ్రీనివాసులు, డీఎస్పీ, 'దిశ' పోలీస్ స్టేషన్

వ్యసనంగా మారింది



రకరకాల సామాజిక మాధ్యమాల ద్వారా ఆకర్షితులు కావడమనేది 'ఎమోషనల్ డిపెండెన్సీ' అంటారు. ఆ గ్రూపులో తిరిగే వారిని బట్టి కూడా ఉంటుంది. ముందుగా దీనిపై తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలి. నాలుగు రోజుల కిందట 8వ తరగతి అమ్మాయి ఇన్‌స్టాగ్రామ్ కోసం ఏడుస్తోందని తల్లిదండ్రులు నా దగ్గర కొచ్చారు. ఇలా అలవాటు చేయడం వల్ల వాళ్లు దానికి బానిసల్లా మారి నష్టపోతున్నారు.

–డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్, మానసిక వైద్య నిపుణుడు, అనంతపురం

జేఈఈ మెయిన్స్‌లో మెరిసిన 'అనంత' విద్యార్థులు





సదుం లేఖన యశ్వంత్ సాత్విక

అనంతపురం: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్స్ (జేఈఈ) మెయిన్స్ ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో మెరిశారు. అనంతపురానికి చెందిన సదుం లేఖన 99.94 శాతం సాధించి జిల్లా టాపర్‌గా నిలిచారు. యశ్వంత్ 99.66, నిఖిల్ అగ్నిహోత్రి 99.63, ఎస్.మదీహా ముష్కన్ 98.66, సాత్విక 98.27, షేక్ జవహారా 98.13, వి.వెంకటభవదీప్ 96.50, సి.లలిత్ ఆదిత్యారెడ్డి 95.80, షేక్ ఖాజీ రిజాముఖద్దమ్ 94.90, గుర్రం పవన్ కార్తికేయ 94.90, బి.దివ్యశ్రీ 95.59, జి.గుణేష్‌కుమార్‌రెడ్డి 95.48, కె.పార్థీప్ 95.30, పి.అరుణ్ సాయికుమార్ 94.69, వై.రితిక 94.30, వై.కీర్తన 94.29, కె.అభిలాష్ 94.20 పర్సంటైల్ సాధించారు.

21 నుంచి తిరుపతి ప్యాసింజర్ రైలు వేళల్లో మార్పు

గుంతకల్లు: తిరుపతి నుంచి గుంతకల్లు (07656) వచ్చే ప్యాసింజర్ రైలు వేళల్లో మార్పు చేసినట్లు సీపీటీఎం ఎ.సురేష్‌రెడ్డి మంగళవారం తెలిపారు. తిరుపతి ఎంపీ ఎం.గురుమూర్తి విజ్ఞప్తి మేరకు ఈ ప్యాసింజర్ రైలు వేళలను మార్చినట్లు ఆయన వెల్లడించారు. తిరుపతి జంక్షన్ నుంచి రోజూ ఉదయం 8.50 గంటలకు బయలుదేరే ఈ రైలు 40 నిమిషాలు ముందుగా ఉదయం 8.10 గంటలకు బయలుదేరుతుందన్నారు. దీంతో గుంతకల్లుకు రాత్రి 8.50 గంటలకు చేరుకునే రైలు సాయంత్రం 7.00 గంటలకు చేరుతుందన్నారు. ఈ నెల 21 నుంచి మారిన వేళలు అమలులోకి వస్తాయని, ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బీసీలకు సముచిత స్థానం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా

అనంతపురం సప్తగిరి సర్కిల్: జగనన్న పాలనలోనే బీసీలకు సముచిత స్థానం లభించిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య స్పష్టం చేశారు. ఆలయ కమిటీల్లో నాయీబ్రాహ్మణులను సభ్యులుగా నియమిస్తూ ఆర్డినెన్స్‌కు ఆమోదం తెలిపినందుకు కృతజ్ఞతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి మంగళవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు నేతృత్వంలో క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం పైలా మాట్లాడుతూ బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్యాస్ట్‌గా కాకుండా బోన్ ఆఫ్ ది సొసైటీగా సీఎం జగన్ భావించి, వారికి సముచిత స్థానం కల్పించారన్నారు. అంబేడ్కర్, పూలే ఆశయాలు కొనసాగిస్తూ బీసీ కులాల్లో 56 కార్పొరేషన్లను ఏర్పాటు చేసి వారికి నామినేటెడ్ పదవులు కేటాయించారన్నారు. గత ప్రభుత్వాలు బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బీసీల అభ్యున్నతిని కోరుకుందని తెలిపారు. నాయీబ్రాహ్మణులకు ఉచిత విద్యుత్ ద్వారా వారి కుటుంబాలకు లబ్ధి చేకూర్చిందన్నారు. అనంతపురం నగరంలో 350 మందికి ఉచిత విద్యుత్ అందుతోందన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,300 సెలూన్ షాపులకు ఉచిత విద్యుత్ వర్తిస్తోందన్నారు. వీటితో పాటుగా ఈ ప్రభుత్వం అందిస్తున్న నవరత్నాల ద్వారా అన్ని పథకాల్లోనూ నాయీబ్రాహ్మణ కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతోందన్నారు. నాయీబ్రాహ్మణులు వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నగర మహిళా విభాగం అధ్యక్షురాలు కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, రామయ్య, నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు విజయభాస్కర్, ఇందిరానగర్ శివ, నగేష్, మోహన్, జయచంద్ర ప్రసాద్, నరేష్, బయన్న, ఎల్లనూరు ప్రసాద్, రామాంజినేయులు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

- ప్రతి రిజిస్ట్రేషన్‌కూ ముడుపు
- ఇవ్వకుంటే ముప్పతిప్పలే
- చిన్న సవరణకూ సమర్పించుకోవాల్సిందే
- సబ్‌రిజిస్ట్రార్ల వ్యవహారంతో విసిగిపోతున్న జనం
- రామ్‌నగర్, రుద్రంపేట కార్యాలయాల్లో 'ప్రైవేట్' వసూల్

అడ్డగోలు దోపిడీ

- నాలుగు రోజుల క్రితం ఆలమూరు రెవెన్యూ పొలానికి సంబంధించి ఓ వ్యక్తి ఐదెకరాలు రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు వెళ్లాడు. అందులో మూడున్నర ఎకరాలు ఆన్‌లైన్‌లో ఉంది. ఒకటిన్నర ఎకరా ఆన్‌లైన్‌లో లేదు. కలెక్టర్ ఎన్‌ఓసీ ఇచ్చినా ఆన్‌లైన్‌లో ఎక్కిన తర్వాత రిజిస్ట్రేషన్ చేయాలి. కానీ రూ.20వేలు తీసుకుని ఆన్‌లైన్లో లేకపోయినా రిజిస్ట్రేషన్ కానిచ్చేశారు.
- గుత్తికి చెందిన ఓ వ్యక్తి రెండ్రోజుల క్రితం అనంతపురం శివారులోని 5 సెంట్ల స్థలాన్ని రహంతుల్లా అనే వ్యక్తికి అమ్మాడు. రిజిస్ట్రేషన్‌కు వెళ్లగా.. అన్నీ పక్కాగానే ఉన్నా లింకు డాక్యుమెంటు ఒకటి లేదని పేచీ పెట్టారు. చివరకు రూ.35 వేల నగదు సమర్పించుకుంటే సబ్‌రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేశారు.
- రాప్తాడుకు చెందిన ఓ ద్వితీయశ్రేణి ప్రజాప్రతినిధి తన డ్రైవరు భూమిని రిజిస్ట్రేషన్ చేయిద్దామని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లాడు. ఈ భూమి జీరో 8 కింద ఉన్నందున చేయలేమని సబ్‌రిజిస్ట్రార్ స్పష్టం చేశారు. రెండు నెలల తర్వాత నేరుగా డ్రైవరే వెళ్లి బ్రోకర్‌ను సంప్రదిస్తే రూ.20వేలు తీసుకుని రిజిస్ట్రేషన్ చేశారు.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: భూములు, స్థలాలు క్రయవిక్రయాలు చేసుకుని రిజిస్ట్రేషన్‌కు వెళ్లాలంటే సామాన్యులు భయపడుతున్నారు. అనంతపురంలోని రుద్రంపేట, రామ్‌నగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సబ్‌రిజిస్ట్రార్లు నిలువుదోపిడీ చేస్తున్నారు. డాక్యుమెంట్లన్నీ సవ్యంగా ఉన్నా ఏదో ఒక క్వెరీ వేసి అదనంగా డబ్బు గుంజనిదే వదలడం లేదు. రోజూ కోట్లాది రూపాయల విలువైన స్థలాలు, భూముల రిజిస్ట్రేషన్ కోసం వచ్చే వందలాది మంది సబ్‌రిజిస్ట్రార్ల దెబ్బకు కుదేలవుతున్నారు. ఒక్కో సబ్‌రిజిస్ట్రార్ రోజూ లక్ష రూపాయలు లేనిదే ఇంటికెళ్లే పరిస్థితి లేదన్న విమర్శలు ఉన్నాయి. తమకు వచ్చే వసూళ్లలో పైవారికి వాటాలివ్వాలని డాక్యుమెంట్ రైటర్లతో చెబుతున్నారు.



వసూల్ రాజాలు వీరే..

హరి, ఈశ్వరయ్య..ఈ పేర్లు అనంతపురం సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులో అందరికీ తెలుసు. హరి...రుద్రంపేట రూరల్ కార్యాలయ సబ్‌రిజిస్ట్రార్‌కు డ్రైవరు. ఇతని ద్వారానే వసూళ్లు జరుగుతున్నట్టు ఎవర్నడిగినా చెప్పేస్తారు. ఇక ఈశ్వరయ్య రామ్‌నగర్‌లోని ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న ఓ ప్రైవేటు వ్యక్తి. వసూళ్లన్నీ చేసి రాత్రికి సబ్‌రిజిస్ట్రార్ ఇంటివద్ద ఇచ్చే బాధ్యత వీరిదే. ఇక డాక్యుమెంటు రైటర్లు సాయంత్రానికి తమ బిజినెస్‌ను బట్టి ఇవ్వాల్సిందే. రేటు మాట్లాడుకుంటే జీరో 8, లింకు డాక్యుమెంట్లు ఇవన్నీ ఏమీ అవసరం లేదు. కోర్టు కేసు ఉన్నా సరే రిజిస్ట్రేషన్ చేస్తారు. లంచం ఇవ్వలేదో.. ఏదో ఒక క్వెరీవేసి రోజూ తిప్పుతారు. చిన్న చిన్న సవరణలు, బౌండరీ మినహాయింపులు, మార్టిగేజ్‌లు వంటి వాటికి డబ్బులు డిమాండు చేస్తుండటంతో రిజిస్ట్రేషన్‌కు వచ్చేవారు లబోదిబోమంటున్నారు. సబ్‌రిజిస్ట్రార్ల వసూళ్లు తారస్థాయికి చేరుకున్నాయి.

డీఐజీ తనిఖీలు చేసినా...

తీవ్ర అవినీతి ఆరోపణలు వస్తుండటంతో నాలుగు రోజుల క్రితం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డీఐజీ మాధవి అనంతపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తనిఖీలు చేశారు. కానీ ఇవి తూతూ మంత్రమే. మళ్లీ మరుసటి రోజు నుంచి వీళ్లు యథాప్రకారం వసూళ్లు చేస్తూనే ఉన్నారు. ప్రతి రిజిస్ట్రేషన్‌కూ ఎంతో కొంత ముడుపు ఇవ్వాల్సిందే.

చిన్న చిన్న వాటికి అడగం

మార్టిగేజ్‌లు, సవరణలు, రిలీజ్‌లు వంటి చిన్న చిన్న వాటికి అడగలేం. వాటికి ఫీజే వెయ్యి రూపాయలుంటుంది. ఇంత తక్కువ ఫీజు ఉన్నప్పుడు మేము అడిగేదేముంటుంది. చిన్న చిన్న వాటిని అసలు పట్టించుకోం.

–మహమూద్ ఆలీ, సబ్‌రిజిస్ట్రార్,

చర్యలు తీసుకుంటాం

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరుగుతున్న వసూళ్లు మా దృష్టికి వచ్చాయి. ఇలాంటి ఆరోపణలు రాకుండా ఉండాలని హెచ్చరించాం. దీనిపై చర్యలు తీసుకుంటాం.

–నాగభూషణం, జిల్లా రిజిస్ట్రార్





మేలుకొల్పుతున్న చిత్రాలు



అనంతపురం సుందరీకరణపై నగరపాలక సంస్థ ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా రామచంద్రానగర్ సైపుల్లా బ్రిడ్జి గోడలపై వేయించిన చిత్రాలు ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. పరిశుభ్రత గురించి వివరిస్తూ తడి, పొడి, ప్రమాదకర చెత్తను ఏ విధంగా వేరు చేసి.. కార్మికులకు అందించాలి.. రక్తదానం.. నీటి పొదుపు ఆవశ్యకత, మొక్కల పెంపకం.. పర్యావరణ పరిరక్షణ.. బాలికల సంరక్షణ తదితర అనేక సామాజిక అంశాలపై మేలుకొల్పేలా వేసిన చిత్రాలు పాదచారులు, వాహనదారులను కట్టిపడేస్తున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

కరాటేలో జిల్లా క్రీడాకారుల ప్రతిభ




ప్రతిభ చూపిన జిల్లా క్రీడాకారులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో అనంత క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. విశాఖ వేదికగా ఈ నెల 3 నుంచి 5 వరకు స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో అంతర్జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్–2023 నిర్వహించారు. ఈ పోటీల్లో కటా విభాగంలో లక్ష్మీనరసింహారెడ్డి, హాసినిరెడ్డి బంగారు పతకాలను, రిహాన్, సమీర్, అర్హంజైన్, గీతికా చౌదరి రజత పతకాలను, వహాస్ జైన్, త్రినేత్రచౌదరి కాంస్య పతకాలను సాధించారు. కుమితి విభాగంలో హాసినిరెడ్డి, సమీర్‌లు స్వర్ణ పతకాలను, గీతిక చౌదరి రజత పతకాన్ని, లక్ష్మి నరసింహారెడ్డి, రిహాన్, ఓహాస్ జైన్ కాంస్య పతకాలను సాధించారు. కార్యక్రమంలో యునైటెడ్ షోటోకాన్ కరాటే డూ ఇండియా మహిరా షోటోకాన్ డూ ఇండియా ఆర్గనైజింగ్ కార్యదర్శి తాజుద్దీన్‌బాబు, అధ్యక్షుడు హైదర్‌అలీ, బ్లాక్ బెల్ట్ మురళీకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కొండమీద రాయుని బ్రహ్మోత్సవాలు

బుక్కరాయసముద్రం: కొండమీదరాయుని బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. చివరి రోజు ఉదయం స్వామి వారికి తీర్థవాది వసంతోత్సవం నిర్వహించారు. అనంతరం రాత్రి కొండమీద రాయున్ని సతీసమేతంగా హంస వాహనంపై బుక్కరాయసముద్రం పుర వీధుల్లో ఊరేగించారు.



హంస వాహనంపై కొండమీదరాయుడు

15 లోపు ఈ–క్రాప్ నమోదు పూర్తి చేయండి

• వ్యవసాయ కమిషనర్ సి.హరికిరణ్ ఆదేశం

అనంతపురం అగ్రికల్చర్: రబీ పంటలకు సంబంధించి ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ ఈ నెల 15 నాటికి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను వ్యవసాయశాఖ కమిషనర్ సి.హరికిరణ్ ఆదేశించారు. మంగళవారం ఆయన జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రస్తుత రబీలో 1.20 లక్షల హెక్టార్ల వరకు పంటలు సాగులోకి వచ్చినందున 100 శాతం ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తి కావాలన్నారు. సాగు చేసిన పంటనే నమోదు చేయాలన్నారు. లేదంటే భవిష్యత్తులో రైతులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. ఈ–క్రాప్ అనేది చాలా ప్రాముఖ్యమైన అంశంగా తీసుకుని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ డేటా ఆధారంగానే ఇన్‌పుట్, ఇన్సూరెన్స్, వైఎస్సార్ రైతు భరోసా, సీహెచ్‌సీలు, సున్నావడ్డీ, పంట ఉత్పత్తులను ఎంఎస్‌పీతో అమ్ముకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. రబీలో పప్పుశనగ, వేరుశనగ పంట స్థితిగతులు, పొలంబడి నిర్వహణ, రెండో విడతగా వైఎస్సార్ యంత్రసేవ కింద కింద కమ్యూనిటీ హైయరింగ్ సెంటర్లు (సీహెచ్‌సీలు) ఏర్పాటు, పోర్టల్ ఇంకా ఓపెన్‌లోనే ఉన్నందున పీఎం కిసాన్ కోసం పెండింగ్‌లో ఉన్న రైతుల ద్వారా తప్పనిసరిగా ఈ–కేవైసీ చేయించడం, ఆర్‌బీకేల్లో అవసరమైన మేరకు ఎరువులు అందుబాటులో ఉంచడం, రానున్న ఖరీఫ్‌కు విత్తన ప్రతిపాదనలు తదితర అంశాలపై దిశా నిర్దేశనం చేశారు. పీఎం కిసాన్ కింద తుది విడతగా అంటే 13వ విడత సొమ్ము రూ.2 వేలు ఈ నెలాఖరులోపు జమ అవుతుందన్నారు. ఈ–కేవైసీ ఇంకా పెండింగ్‌లో ఉన్నందున సాధ్యమైనంత ఎక్కువ మంది రైతులకు న్యాయం చేయాలనే ఆలోచనతో కాస్త జాప్యం అవుతోందన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్‌తో పాటు డివిజన్ ఏడీఏలు, టెక్నికల్ ఏఓలు, ఎంఏఓలు పాల్గొన్నారు.

ఎస్‌పీఎల్ విజేత ఆర్ట్స్ కళాశాల

• జూనియర్ విభాగంలో ఆత్మకూరు జట్టు
• విజేత జట్లకు ట్రోఫీల ప్రదానం

అనంతపురం సప్తగిరి సర్కిల్: 'సాక్షి' మీడియా గ్రూపు ఆధ్వర్యంలో అనంత క్రీడాగ్రామం వేదికగా నిర్వహించిన సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లు మంగళవారం ఉత్కంఠగా సాగాయి. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో సీనియర్ విభాగంలో అనంతపురం ఆర్ట్స్ కళాశాల, జూనియర్ విభాగంలో ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల జట్లు విజేతలుగా నిలిచాయి. టోర్నీ విజేతలుగా నిలిచిన ఈ రెండు జట్లు త్వరలో జరిగే ఎస్‌పీఎల్ రీజనల్ స్థాయి టోర్నీలో పాల్గొననున్నాయి.

సిక్సర్లతో బెంబేలెత్తించిన అంగేష్..

జూనియర్ విభాగం ఫైనల్స్‌లో ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, అనంతపురం సాయి విజ్ఞాన్ జూనియర్ కళాశాల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన సాయి విజ్ఞాన్ కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 85 పరుగులు చేసింది. జట్టులో శివమణి 30 బంతుల్లో 6 ఫోర్లతో 44 పరుగులు చేశాడు. ఆత్మకూరు బౌలర్లలో రాజేష్ 2 వికెట్లు సాధించాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆత్మకూరు జట్టు 9.4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జట్టులో అంగేష్ 28 బంతుల్లో 6 సిక్సర్లతో 36 పరుగులు సాధించి జట్టు విజయంలో కీలకంగా మారాడు.

కట్టడి చేసిన ఆర్ట్స్ కళాశాల బౌలర్లు..

సీనియర్ విభాగంలో అనంతపురం ఆర్ట్స్ కళాశాల, అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి అనంతలక్ష్మి జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్ట్స్ కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 129 పరుగులు చేసింది. జట్టులో వెంకటేష్ 18 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 48 పరుగులు సాధించాడు.



సీనియర్ విభాగంలో విజేత ట్రోఫీని అందుకుంటున్న ఆర్ట్స్ కళాశాల జట్టు



రన్నర్స్ ట్రోఫీని అందుకుంటున్న అనంతలక్ష్మి జట్టు

మరో బ్యాటర్ భీమ 27 బంతుల్లో 5 ఫోర్లతో 41 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన అనంతలక్ష్మి జట్టు లక్ష్య ఛేదనలో పూర్తిగా తడబడింది. ఓపెనర్ ప్రశాంత్ తొలి రెండు బంతుల్లో ఫోర్, సిక్సర్ బాదాడు. ఆ తర్వాత ఆర్ట్స్ కళాశాల బౌలర్ల ధాటికి తలొగ్గక తప్పలేదు. నిర్ణీత 10 ఓవర్లలో అనంతలక్ష్మి జట్టు 4 వికెట్లు కోల్పోయి 65 పరుగులు మాత్రమే చేసింది. 64 పరుగుల తేడాతో ఆర్ట్స్ కళాశాల జట్టు విజేతగా నిలిచింది.

SAKSHI | SAKSHI DIGITAL | MEDIA GROUP

SPL SAKSHI PREMIER LEAGUE

యువతకు క్రీడలే స్ఫూర్తి..

యువతకు క్రీడలే స్ఫూర్తిగా నిలుస్తాయని జేఎన్‌టీయూ (ఏ) రిజిస్ట్రార్ సి.శశిధర్ అన్నారు. ఎస్‌పీఎల్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విజేత జట్లకు ట్రోఫీలను ప్రదానం చేసి, మాట్లాడారు. నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు యువతకు పోరాడే తత్వాన్ని క్రీడలే నేర్పిస్తాయన్నారు. క్రీడలతో పాటు విద్యలోనూ రాణించినప్పుడే సమాజంలో గుర్తింపు ఉంటుందన్నారు. ఈ తరహా క్రీడలు నిర్వహించడం చాలా శ్రమతో కూడుకున్న పని అని, అయితే యువతను అన్నివిధాలుగా ప్రోత్సహిస్తూ సాక్షి మీడియా యాజమాన్యం ఇలాంటి టోర్నీలను నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో సాక్షి అనంతపురం బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్, అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.



జూనియర్ విభాగంలో ఆత్మకూరు జూనియర్ కళాశాల జట్టుకు విన్నర్స్ ట్రోఫీని అందజేస్తున్న జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ శశిధర్



రన్నర్స్ ట్రోఫీని అందుకుంటున్న సాయి విజ్ఞాన్ జూనియర్ కళాశాల జట్టు

సాగులో ఉన్న ప్రతి రైతుకూ హక్కు పత్రం

• ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వ



వజ్రకరూరు: అటవీ భూములు సాగు చేస్తున్న ప్రతి గిరిజన రైతుకూ సాగు హక్కు పత్రాలు అందజేసేందుకు వైఎస్ జగన్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. వజ్రకరూరు మండలం పందికుంట తండాలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్ హయాంలో ఒక్క ఉరవకొండ ప్రాంతంలోనే వెయ్యి మంది గిరిజన రైతులకు సాగు హక్కు పత్రాలు మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం వజ్రకరూరు, ఉరవకొండ మండలాల్లోని అటవీ భూములు సాగు చేస్తున్న గ్రామాల్లో ఫారెస్ట్, ట్రైబల్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా గ్రామసభలు నిర్వహించి సాగులో ఉన్న రైతుల వివరాలు సేకరించారన్నారు. ఈ విషయాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి సాగు హక్కు పత్రాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించినట్లు పేర్కొన్నారు. ఇదే అంశంపై ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి కూడా ఆదేశాలు జారీ అయ్యాయన్నారు. త్వరలో జిల్లా వ్యాప్తంగా గిరిజన రైతులకు సాగు హక్కు పత్రాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు.

విద్యుత్ షాక్.. ప్రైవేట్ కార్మికుడికి గాయాలు

• విద్యుత్ ఉద్యోగుల స్థానంలో ప్రైవేట్ వ్యక్తుల విధులు

అనంతపురం టౌన్: విధుల నిర్వహణపై విద్యుత్ శాఖ ఉద్యోగుల అలసత్వం ప్రైవేట్ కార్మికులకు ప్రాణ సంకటంగా మారింది. తాము చేయాల్సిన పనులను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించి ఇతరత్రా వ్యాపకాల్లో నిమగ్నమవుతున్నారు. ఈ క్రమంలోనే మంగళవారం విద్యుత్ ఉద్యోగి బదులు ఆయన విధులు నిర్వర్తిస్తున్న ఓ ప్రైవేట్ కార్మికుడు విద్యుత్ షాక్‌కు గురై స్తంభం పైనుంచి కిందపడి ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో కొట్టుమిట్టాడుతున్నాడు. అనంతపురం శివారులోని బళ్లారి రోడ్డు డీ–5 సెక్షన్ సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. ఇక్కడ లైన్‌మెన్‌గా పనిచేస్తున్న వ్యక్తి తన స్థానంలో రమేష్ అనే ప్రైవేట్ వ్యక్తిని ఏర్పాటు చేసుకుని పనిచేయిస్తున్నాడు. మంగళవారం ఉదయం పాపంపేటలో ఓ విద్యుత్ వినియోగదారుడు తన ఇంటికి విద్యుత్ సరఫరా కాలేదంటూ విద్యుత్ అధికారులకు ఫోన్ చేశాడు. ఆ సమయంలో రెగ్యులర్ ఉద్యోగుల స్థానంలో ఇద్దరు ప్రైవేట్ వ్యక్తులు రమేష్, శివనాయక్ విధుల్లో ఉన్నారు. దీంతో వారు అక్కడకు చేరుకుని పరిశీలించారు. రమేష్ విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతు చేస్తుండగా షాక్‌కు గురై ఒక్కసారిగా స్తంభం పైనుంచి కింద పడ్డాడు. స్థానికులు వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రెగ్యులర్ ఉద్యోగుల స్థానాల్లో ప్రైవేట్ వ్యక్తులు పనులు చేయకుండా ఆరికట్టాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. ఇదే విషయంపై విద్యుత్ శాఖ డీఈ రమేష్‌ను వివరణ కోరగా ప్రైవేట్ వ్యక్తులను విధులకు పంపడం నిబంధనలకు విరుద్ధమన్నారు. అలా చేస్తున్న ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

వెలుగు చూస్తున్నవి కొన్నే...

ప్రభుత్వం నుంచి ప్రతి నెలా జీతం తీసుకుంటున్న విద్యుత్ శాఖ ఉద్యోగులు కొందరు తమ విధుల నిర్వహణపై అంతులేని నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రైవేట్ వ్యాపారాల మోజులో చాలా మంది ప్రైవేట్ వ్యక్తులను ఏర్పాటు చేసుకుని నెలకు రూ.5 నుంచి రూ.8 వేల వరకు కూలి చెల్లిస్తున్నారు. ఈ క్రమంలో ఎందరో ప్రైవేట్ వ్యక్తులు విద్యుత్ షాక్‌కు గురయ్యారు. వీరిలో కొందరు ప్రాణాలు కోల్పోగా.. మరికొందరు వైకల్యం బారిన పడ్డారు. ఇందులో వెలుగు చూస్తున్న ఘటనలు కొన్నే ఉన్నాయి.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రమేష్

- నాలుగు నెలల క్రితం రాప్తాడు మండల పరిధిలో విద్యుత్ షాక్‌కు గురైన ఓ ప్రైవేట్ కార్మికుడు కంటి చూపును కోల్పోయాడు. చేతులు కూడా పనిచేయకపోవడంతో ఇంటి వద్దనే చికిత్స చేయించుకుంటున్నాడు.
- అనంతపురం డీ–5 సెక్షన్‌లోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఓ లైన్‌మెన్ తన బదులు శ్రీకాంత్ అనే వ్యక్తిని ఏర్పాటు చేసుకుని నెలకు రూ.8వేలు కూలి చెల్లిస్తున్నాడు. ఇదే సబ్ స్టేషన్‌లో పోల్ టూ పోల్ విధులు నిర్వహిస్తున్న మన్సూర్ అనే ఉద్యోగి రూ.7వేలకు శివనాయక్ అనే ఓ ప్రైవేట్ ఉద్యోగిని ఏర్పాటు చేసుకున్నాడు.
- అనంతపురం గుత్తిరోడ్డు లోని మార్కెట్ యార్డ్ సమీపంలో ఉన్న డీ–6 సబ్‌స్టేషన్ పరిధిలో పెద్ద మొత్తంలో జీతం తీసుకుంటున్న ఇద్దరు లైన్‌మెన్లు వారి స్థానాల్లో ఇద్దరు ప్రైవేట్ వ్యక్తులను విధులకు పంపుతున్నారు. వీరికి నెలకు రూ.8 వేల నుంచి రూ.10వేలు కూలి చెల్లిస్తున్నారు.

వ్యసనాలకు డబ్బివ్వలేదని ఇల్లాలినే హతమార్చాడు!

• గుత్తిలో దారుణం
• ఆత్మహత్యగా చిత్రీకరించే యత్నం
• హతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదుతో వెలుగు చూసిన వాస్తవం



మృతురాలు జుబేదాబీ



తల్లి కోసం ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లిన చిన్నారులు

గుత్తి: గుత్తిలో దారుణం చోటు చేసుకుంది. తన వ్యసనాలు తీర్చుకునేందుకు అవసరమైన డబ్బును పుట్టింటి నుంచి తీసుకురాలేదన్న అక్కసుతో కట్టుకున్న భార్యనే హతమార్చాడు ఓ దుర్మార్గుడు. అనంతరం ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తిలోని తాడిపత్రి రోడ్డులో ఉన్న మారుతీ నగర్‌కు చెందిన ఖాజా, జుబేదాబీ దంపతులు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఏడాది లోపు వయసున్న ఓ కుమారుడు ఉన్నాడు. కారు డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న ఖాజా తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలో మద్యం కొనుగోలుకు అవసరమైన డబ్బును పుట్టింటికెళ్లి తీసుకురావాలని భార్యను వేధించేవాడు. అయితే కొద్దిగా కొద్దిగా కాకుండా ఒక్కసారిగా పెద్ద మొత్తంలో డబ్బును భార్య పుట్టింటి నుంచి తీసుకువచ్చేలా పథకం వేశాడు. ఇందులో భాగంగా తాను కారు కొనుగోలు చేస్తున్నానని, ఇందుకు రూ.2 లక్షలు ఇప్పించుకుని రావాలని భార్యకు పురమాయించాడు. ఇదే విషయాన్ని తన తల్లిదండ్రులకు జుబేదాబీ వివరించింది. అల్లుడి తాగుడు అలవాటు గురించి తెలిసిన అత్తమామలు తొలుత రూ.20 వేలు ఇచ్చారు. మిగిలిన డబ్బు త్వరలో సమకూరుస్తామని భరోసానిచ్చారు. అయితే తాను అడిగిన మొత్తం తీసుకురాలేదన్న అక్కసుతో సోమవారం అర్ధరాత్రి మద్యం మత్తులో జుబేదాబీతో గొడవ పడ్డాడు. తల్లిని తండ్రి కొడుతుండడంతో నిద్ర మేల్కొన్న కుమార్తెలు సోమియా తవేరా, అలియా భయంతో ఏడుస్తూ తల్లిని గట్టిగా హత్తుకున్నారు. పిల్లలు చూస్తుండగానే జుబేదాబీని ఖాజా గొంతు నులిమి హతమార్చాడు. అనంతరం తాడుతో ఫ్యాన్‌కు ఉరి వేశాడు. మంగళవారం ఉదయం ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు అల్లుడి ఇంటి వద్దకు చేరుకుని చూడగా విగత జీవిగా ఉరికి వేలాడుతున్న కుమార్తెను చూసి బోరున విలపించారు. అప్పటికే తల్లి కోసం ఏడ్చి, ఏడ్చి సొమ్మసిల్లిన చిన్నారులను స్థానికులు చేరదీశారు. సమాచారం అందుకున్న సీఐ వెంకట్రామిరెడ్డి, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. తమ కుమార్తెను అల్లుడే హతమార్చి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడంటూ జుబేదాబీ తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు తమదైన శైలిలో విచారణ చేశారు. దీంతో జుబేదాబీని భర్త ఖాజానే హతమార్చినట్లు వెల్లడైంది. ఖాజాపై హత్య కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ వెంకట్రామిరెడ్డి తెలిపారు.

యాజమాన్య ఒత్తిళ్లు తాళలేకనే ఆత్మహత్యాయత్నం

• పోలీసుల విచారణలో నారాయణ కళాశాల విద్యార్థిని వెల్లడి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: కళాశాల యాజమాన్యం వేధింపులు తాళలేకనే తాను ఆత్మహత్యాయత్నం చేసినట్లు పోలీసులకు అనంతపురం బస్టాండు సమీపంలోని నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థిని భవ్యశ్రీ వివరించింది. విషమ పరిస్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భవ్యశ్రీని పోలీసులు విచారణ చేస్తుండగా చిత్రీకరించిన అంశాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఈ విషయం వెలుగు చూసింది. విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి మొదట కుటుంబకలహాలే కారణమన్న కోణంలో కళాశాల యాజమాన్యం చిత్రీకరించే ప్రయత్నం చేసింది. అదే నిజమని బుకాయించే ప్రయత్నం చేసింది. అయితే బాధిత విద్యార్థిని కుటుంబసభ్యులు అందుబాటులో లేకపోవడంతో ఆత్మహత్యాయత్నానికి దారి తీసిన కారణాలను పోలీసులు ఆరా తీయడంతో అసలు కథ వెలుగులోకి వచ్చింది. విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో ఆమెను రాత్రికి రాత్రి బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

హాజరెందుకేయలేదని ప్రశ్నించిన పోలీసులు

సోమవారం మధ్యాహ్నం చోటు చేసుకున్న ఘటనపై అదే రోజు నారాయణ కళాశాలలో అనంతపురం వన్‌టౌన్ సీఐ రవిశంకరరెడ్డి విచారణ చేపట్టారు. విద్యార్థిని భవ్యశ్రీ ఉదయం 7.20 గంటలకు కళాశాలకు చేరుకున్నట్లుగా గుర్తించారు. మధ్యాహ్నం 12.30 గంటలకు కళాశాల నాల్గో అంతస్తు మీద నుంచి కిందకు దూకి ఆత్మహత్యాయత్నం చేసినట్లుగా నిర్ధారించుకున్నారు. విద్యార్థిని హాజరుకు సంబంధించి పట్టికను పరిశీలించగా అందులో అబ్సెంట్ వేసి ఉండడంపై సంబంధిత అధికారులను సీఐ రవిశంకరరెడ్డి ప్రశ్నించారు. కళాశాలకు హాజరైనా.. అబ్సెంట్ ఎందుకు వేశారంటూ ప్రిన్సిపాల్‌ను మందలించారు.

విద్యార్థులను ఆరా తీసిన డీఎస్పీ : విద్యార్థిని భవ్యశ్రీ ఆత్మహత్యాయత్నానికి దారి తీసిన కారణాలపై డీఎస్పీ జి. ప్రసాదరెడ్డి మంగళవారం ఆరా తీశారు. భవ్యశ్రీకి అత్యంత సన్నిహితంగా ఉన్న వారిని పిలిచి ఘటనకు సంబంధించిన కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఫీజుల చెల్లింపు విషయంలో యాజమాన్యం కర్కశంగా వ్యవహరిస్తోందంటూ డీఎస్పీ ఎదుట పలువురు విద్యార్థులు వాపోయినట్లు తెలిసింది.

రైల్లో నుంచి జారి పడి యువకుడి మృతి

గుత్తి: ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి ఓ యువకుడు మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... గుత్తి మండలం కొజ్జేపల్లికి చెందిన రవితేజ (22) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. సోమవారం తన విద్యార్హతకు సంబంధించిన సర్టిఫికెట్లను అనంతపురంలో సేకరించుకుని రైలులో హైదరాబాద్‌కు ప్రయాణమయ్యాడు. గుత్తి సమీపంలోని కాల్వగడ్డ ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో డోర్ వద్ద నిల్చొని ఉన్న రవితేజ అదుపు తప్పి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పట్టాల పక్కనే మృతదేహం పడి ఉన్నట్లు సమాచారం అందడంతో మంగళవారం ఉదయం గుత్తి రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. లభ్యమైన ఆధారాలను బట్టి మృతుడిని రవితేజగా గుర్తించి, కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు వచ్చి పరిశీలించి, మృతుడిని రవితేజగా నిర్ధారించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు గుత్తి జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప తెలిపారు.

ఎస్‌డబ్ల్యూపీసీ నిర్వహణపై అవగాహన

యాడికి: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం (ఎస్‌డబ్ల్యూపీసీ) నిర్వహణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకుని జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పంచాయతీ సిబ్బందికి జెడ్పీ సీఈఓ భాస్కరరెడ్డి పిలుపునిచ్చారు. ఎస్‌డబ్ల్యూపీసీల నిర్వహణపై జిల్లా వ్యాప్తంగా పంచాయతీ సిబ్బందికి అవగాహన కల్పించేందుకు రెవెన్యూ డివిజన్ల వారీగా ఎంపిక చేసిన పంచాయతీల అధికారులు, సిబ్బందికి మంగళవారం యాడికి డంపింగ్ యార్డులో సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ మాట్లాడుతూ.. అనంతపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఆకుతోటపల్లి, కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్‌లోని కుందుర్పి, గుంతకల్లు రెవెన్యూ డివిజన్‌లోని యాడికి డంపింగ్ యార్డులను పైలెట్ ప్రాజెక్టులుగా ఎంపిక చేసినట్లు వివరించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపింగ్ యార్డుల్లో కంపోస్టుగా మార్చడంపై అవగాహన కల్పించారు. సదస్సుకు యాడికి సర్పంచ్ అనురాధ అధ్యక్షత వహించారు. యాడికి, కుందుర్పి మండలాల ఎంపీడీఓలు వెంకటేశ్వర్లు, నారాయణస్వామి, రాప్తాడు, పుట్లూరు ఈఓఆర్డీలు మాధవి, ఆనందప్రసాద్, జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం రీసోర్స్ పర్సన్ సౌజన్యకుమారి, డీఎల్‌పీఓలు రఘు, దామోదరరెడ్డి, ఏపీఎం చంద్రశేఖర్, సచివాలయ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

సోలార్‌కు ఇచ్చే భూములకు చట్టబద్ధమైన రక్షణ కల్పించాలి

• సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

అనంతపురం టవర్‌క్లాక్: పవన, సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు రైతుల నుంచి లీజుకు తీసుకున్న భూములకు చట్టబద్ధమైన రక్షణ కల్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్థానిక ఎన్జీఓ హోంలో సీపీఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. రాయలసీమ ప్రాంతంలో ఏడాదిలో 300 రోజులు ఎండలు ఉంటాయని, దీంతో ఈ ప్రాంతం సౌర విద్యుత్ ఉత్పత్తికి అనువుగా ఉంటుందన్నారు. ఈ క్రమంలో ఏడాదికి రూ.30 వేలు లీజు కాకుండా ప్రతి నెలా రూ.30 వేలు రైతులకు చెల్లించాలని కోరారు. డిమాండ్ సాధనలో భాగంగా ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు ఓబులు, రాంభూపాల్, సావిత్రి, నల్లప్ప, శ్రీనివాసులు, రామిరెడ్డి, ఆర్‌వీ నాయుడు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రమాబాయి సేవలు మరువలేనివి

అనంతపురం టవర్‌క్లాక్: త్యాగశీలి రమాబాయి సేవలు మరువలేనివని ఎస్సీ,ఎస్టీసంఘాల జేఏసీ అధ్యక్షుడు సాకే హరి తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద రమాబాయి 125వ జయంతి వేడుకలు జరిపారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయండి

ఆత్మకూరు: మండలంలోని గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ హేమలత ఎంపీడీఓ విజయ్ ప్రసాద్‌ను కోరారు. మంగళవారం నూతన ఎంపీడీఓను ఎంపీపీ కార్యాలయంలో సన్మానించారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 80 మంది ఎంపిక



క్యాంపస్ ఇంటర్వ్యూలకు హాజరైన విద్యార్థులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో మంగళవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 80 మంది విద్యార్థులు ఎంపికయినట్లు రెక్టార్ ప్రొఫెసర్ ఏ మల్లికార్జున రెడ్డి పేర్కొన్నారు. శ్రీ చైతన్య కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో మొత్తం 142 మంది పీజీ విద్యార్థులు పాల్గొన్నారు. డెమో నిర్వహించి మొత్తం 80 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఎస్కేయూ ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ కే అనిత, పీఆర్వో డాక్టర్ కే రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సురభి కళాకారులను ఆదుకోవడమే లక్ష్యం



పోస్టర్లను, కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

అనంతపురం కల్చరల్: సురభి కళాకారులను ఆదుకోవడమే లక్ష్యంగా రాయలసీమలో తొలిసారి 'ఘంటసాల నాటకం' ప్రదర్శిస్తున్నట్లు రచయిత దర్శకుడు భాస్కరుని సత్యజగదీష్ తెలిపారు. మంగళవారం స్థానిక మూడోరోడ్డులోని ఘంటసాల భవన్‌లో సీనియర్ గాయకులు పాలసముద్రం నాగరాజు, ఘంటసాల ఆరాధన సమితి అధ్యక్షులు జీవీ రామయ్య, గాయనీమణి బృందామూర్తితో కలిసి తెలంగాణ నుంచి విచ్చేసిన నాటక నిర్వాహకులు సత్యజగదీష్ మాట్లాడారు. అనంతలో ఈనెల 11న స్థానిక లలిత కళ పరిషత్తులో సాయంత్రం 6.30 గంటలకు నాటక ప్రదర్శన ఉంటుందన్నారు.

నేడు శిక్షణ

అనంతపురం సప్తగిరి సర్కిల్: అనంతపురం నియోజకవర్గ పరిధిలోని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు శిక్షణ ఇస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. స్థానిక కేటీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 9.30 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి అనంతపురం అర్బన్ నియోజకవర్గ పరిశీలకుడు వెంకటరెడ్డి యాదవ్, ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు. కార్యక్రమాన్ని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు విజయవంతం చేయాలని కోరారు.

పెచ్చులూడిన భవనం

అనంతపురం: నగరంలోని ఆదిమూర్తి నగర్‌లో ఉన్న ఓ కార్పొరేట్ జూనియర్ కాలేజీలో మంగళవారం మధ్యాహ్నం భవనం పైకప్పు పెచ్చులూడింది. విద్యార్థిని చేతివేలిపై పడడంతో స్వల్ప గాయమైంది. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. వేలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ పాత భవనంలో తరగతులు నిర్వహించడంతో ఇలా జరిగినట్లు విద్యార్థులు తెలిపారు.

మాజీ సైనికుడు మృతి



ప్రభాకరరెడ్డికి నివాళులర్పిస్తున్న మాజీ సైనికుల సంఘం నాయకులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: మాజీ సైనికుడు సార్జెంట్ జి.ప్రభాకర్ రెడ్డి (82) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన 1960 నుంచి 1975 వరకు భారతీయ వాయుసేనలో సేవలందించారు. ఆయన బళ్లారి బైపాస్‌లోని సత్యదేవనగర్‌లోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. మాజీ సైనికుల సంఘం సభ్యులు నివాళులర్పించారు. మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కెప్టెన్ షేకన్న, ప్రధాన కార్యదర్శి కెప్టెన్ పట్నం ఉమామహేశ్వరరావు, ట్రెజరర్ తిమ్మారెడ్డి, కుమారస్వామి, నాగిరెడ్డి, హుస్సేన్, నరసింహులు, ఏకేమోద్దీన్ ,రవికుమార్, ఖాజమొయిద్దీన్, హుస్సేన్, ఇస్మాయిల్ షఫీ, నవబీరసూల్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలకు అడ్డుకట్ట ఏదీ?

- టౌన్ ప్లానింగ్ అధికారుల ప్రేక్షకపాత్ర
- నిబంధనలు అతిక్రమించినా పట్టించుకోని వైనం
- నగరంలో వెయ్యికిపైగా అక్రమ నిర్మాణాలు



హౌసింగ్ బోర్డు ప్రాంతంలో రోడ్డును ఆక్రమించి పునాది వేసిన భవనం ఇదే



సాయినగర్ అంబేడ్కర్ భవనం వెనుకవైపున సెట్‌బ్యాక్స్ లేని సెల్లార్‌ను ఏర్పాటు చేసిన దృశ్యం

అనంతపురం క్రైం: నగరంలో వివిధ భవనాల అతిక్రమణలకు చెక్ పెట్టడంలో టౌన్ ప్లానింగ్ అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిర్మాణదారులు నిబంధనలను అతిక్రమిస్తున్నా..టౌన్ ప్లానింగ్ విభాగంలో ఏసీపీలు, టీపీఓ, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారన్న అనుమానాలున్నాయి. నగరంలో వెయ్యికిపైగా భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. 90 శాతం నిర్మాణాల్లో నిబంధనలను తుంగలోకి తొక్కినా అధికారులు పట్టించుకోలేదు. కేవలం నోటీసులు జారీ చేసి చేయి దులుపుకుంటున్నారు. తర్వాత చార్జ్‌షీట్ దాఖలు చేసి వదిలేస్తున్నారు. నగరంలోని హౌసింగ్ బోర్డు ప్రాంతంలో ట్యాంకు ముందు బహుళ అంతస్తుల భవనం నిర్మిస్తున్నారు. వాస్తవంగా లేఅవుట్‌లో ఇక్కడ 33 అడుగుల రోడ్డు ఉంది. రోడ్డుకు కార్నర్‌లో ఉన్న భవనాలు కనీసం 8 అడుగులు వెనక్కు వెళ్లాలి. అదీ చేయకుండా ఓ ఫ్లోర్ అదనంగా వేశారు. నగరంలోని సాయినగర్‌లో అంబేడ్కర్ భవనం వెనుకవైపు ఓ నిర్మాణదారుడు సెల్లార్ అనుమతులు లేకున్నా నిర్మించేస్తున్నాడు. సాయినగర్‌తో పాటు విద్యుత్‌శక్తి నగర్, విద్యుత్‌నగర్ నుంచి అరవిందనగర్‌కు వెళ్లే మార్గంలో సెల్లార్లను ఏర్పాటు చేసినా అధికారులు పట్టించుకోలేదు.

భారీగా ముడుపులు :

సెల్లార్ల ఏర్పాటు కోసం అధికారులు భారీగా ముడుపులు తీసుకుంటున్నట్లు సమాచారం. నగరంలో వెయ్యికిపైగా నిర్మాణాలు జరుగుతున్నా, నగరపాలక సంస్థ అధికారులు కేవలం 500 మాత్రమే జరుగుతున్నాయని చెప్పున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు కేవలం వంద భవనాలకు మాత్రం అపరాధ రుసుం వేశారు. వివిధ డివిజన్లలో నిర్మించిన 98 భవనాలకు రూ.32 కోట్లు చార్జ్‌షీట్లు వేశారు. కానీ వాటి వసూళ్ల విషయాన్ని పూర్తిగా పక్కన పెట్టారు. టౌన్‌ప్లానింగ్ విభాగంలో కొందరు అధికారులు కుమ్మక్కయ్యారు. డివిజన్లు పంచుకొని ఆక్రమణలకు అనుమతిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. గత ఆరు నెలలుగా కనీసం ఐదు నిర్మాణాలను కూడా పరిశీలించిన దాఖలాలు లేవు. పలువురు అధికారులు కొత్తగా వచ్చామని చెప్పడం, మరో అధికారి ఆరోగ్యం సహకరించలేదని, మరో ఇద్దరు తాము మిస్టర్ ఫర్‌ఫెక్ట్ అంటూ ఎవరికి వారు కితాబిచ్చుకుని మాట దాటవేస్తున్నారు.

టౌన్‌ప్లానింగ్ అధికారుల తీరుపై అసహనం :

నగరంలో ఇష్టానుసారంగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా పట్టించుకోలేదని, పాలకవర్గంపై అపవాదు వచ్చేలా వ్యవహరిస్తున్నారని మేయర్ వసీం గతేడాది డిసెంబర్ 3న జరిగిన సమావేశంలో కమిషనర్ కే భాగ్యలక్ష్మిని ప్రశ్నించారు. ఈ నెల 4న స్టాండింగ్ కమిటీ సమావేశంలోనూ మేయర్ వసీం మరోసారి టౌన్ ప్లానింగ్ విభాగం అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. నిర్మాణాలు ఇష్టానుసారంగా చేపడుతుండడంపై ఫిర్యాదు చేస్తే, కార్పొరేటర్ అడ్డుపడుతున్నారని నిర్మాణదారులకు సమాచారం ఇస్తూ తమను చెడ్డ చేస్తున్నారని ఈ నెల 4న జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో సభ్యులు అన్నారు.

> **ఆక్రమణలు తొలగిస్తాం**
>
> నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయి. వాటిలో అతిక్రమణలను గుర్తించాం. ఆక్రమణలు తొలగించాలని ఏసీపీలను ఆదేశించాం. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవు .
>
> – కే భాగ్యలక్ష్మి, నగరపాలక సంస్థ కమిషనర్

వైఎస్సార్‌సీపీతోనే గ్రామాల అభివృద్ధి



ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

రామగిరి: పేదల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనతో గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పెద్దకొండాపురం పంచాయతీలోని రెడ్డివారిపల్లి, పెద్దకొండాపురం, చిన్నకొండాపురం, మక్కినవారిపల్లి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు, బలహీనవర్గాలతోపాటు పార్టీలకతీతంగా అన్నివర్గాలకు సమన్యాయం చేస్తున్నారన్నారు. ప్రతి ఇంటికీ రైతు భరోసా, అమ్మ ఒడి, పింఛన్‌తోపాటు ఎన్నో పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.

పరిటాల కుటుంబంతో అభివృద్ధి శూన్యం :

పేరూరుడ్యాంకు హంద్రీనీవా నీరు తెప్పించినట్లు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని చెరువులకు నీరందించామన్నారు. ముత్యాలమ్మ ఆలయం దేవదాయశాఖ పరిధిలోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. త్వరలో రామగిరి బంగారు గనులు తెరవడంతోపాటు, తోపుదుర్తి ట్రస్ట్ ఆధ్వర్యంలో డెయిరీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 25 ఏళ్లుగా పరిటాల కుటుంబ సభ్యులే మంత్రులు, ఎంఎల్ఏలుగా కొనసాగినా ప్రజలకు ఏమాత్రం న్యాయం జరగలేదన్నారు. అప్పట్లో వర్షాలులేక, పంటలు పండక రైతులు, ప్రజలు కర్ణాటక, తమిళనాడు, కేరళ, మహారాష్ట్రకు వలస వెళ్లేవారన్నారు. అనంతరం స్థానిక పాఠశాలను ఎమ్మెల్యే తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. తహసీల్దార్ నారాయణస్వామి, ఎంపీడీఓ ఆజాద్, సీఐ చిన్నగౌస్, ఎంపీపీ కత్రెన్న, జెడ్పీటీసీ నాగార్జున, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్, సర్పంచులు రామ్మూర్తి, మీనుగ నాగరాజు, సిద్దన్న, రాజేష్, నరేంద్ర, చెన్నకేశవరెడ్డి, ఎస్ఐలు జనార్ధన్‌నాయుడు, శ్రీధర్, నాయకులు వెంకటరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నరసింహారెడ్డి, రామ్మోహన్, జనార్దన్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



విద్యుత్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అనంత

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం టౌన్: నగరంలో విద్యుత్ సమస్యలపై సత్వరమే స్పందించి పరిష్కార మార్గం చూపాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి విద్యుత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విద్యుత్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటి వరకు నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో విద్యుత్ సమస్యలపై వారితో సమీక్ష నిర్వహించారు. నగరంలో పలు చోట్ల విద్యుత్ స్తంభాల ఏర్పాటు , ఇళ్లపై నుంచి విద్యుత్ తీగలు వెళ్లి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే వెంటనే ప్రత్యేక దృష్టి సారించి, పరిష్కరించాలన్నారు. ఇందుకు సంబంధించిన ఎస్టిమేట్లను సిద్ధం చేయాలన్నారు. నగరంలోని జనశక్తి నగర్, 1నుంచి 5వ రోడ్డు, రాణినగర్‌లో పెద్ద సంఖ్యలో విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ఆ సమస్యల్లో ఎన్ని పరిష్కరించారని ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు 250 ఫిర్యాదులు రాగా, వాటిలో ఇప్పటికే 80 శాతం మేర సమస్యలకు పరిష్కారం చూపినట్లు డీఈ రమేష్ ఎమ్మెల్యేకు తెలిపారు. నవోదయ కాలనీ, నారాయణపురం, రుద్రంపేట, టీవీ టవర్ తదిత ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీలు అధికంగా ఉన్నారని, ఆ కాలనీలపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రభుత్వ ప్రయోజనాలను వారికి తెలియజేయాలన్నారు. డీఈతోపాటు ఏఈలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

రాప్తాడు: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ వీరబ్బాయి దొర వైద్య సిబ్బందికి సూచించారు. ఆయన మంగళవారం రాప్తాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఐఓ యుగంధర్‌తో కలిసి తనిఖీ చేశారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ సిబ్బంది ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉండి వైద్య సేవలందించాలన్నారు. సోమవారం మినహా ప్రతి రోజూ మెడికల్ ఆఫీసర్ల క్యాంపులకు వెళ్లాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాతాశిశు మరణాల రేటు తగ్గించాలన్నారు. నవజాత శిశు సంరక్షణ (హెచ్‌బీఎన్‌సీ), చిన్న పిల్లల గృహ ఆధారిత సంరక్షణ (హెచ్‌బీవైసీ) గురించి వివరించారు. వైద్యాధికారి శ్రావణి, సూపర్‌వైజర్ అరుణమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.



హెచ్‌బీఎన్‌సీ కిట్ల గురించి వివరిస్తున్న డీఎంఅండ్‌హెచ్ఓ వీరబ్బాయి దొర

సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలి

రాప్తాడు: గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పరిష్కరించాలని ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ పసుపుల హేమావతి సూచించారు. అర్హత కలిగిన ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు చూడాలన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సాల్మన్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు.

అర్హులందరికీ పథకాలు అందాలి: అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామాల్లో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చొరవ చూపాలని ఎంపీపీ, జెడ్పీటీసీ పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో ప్రతి కుటుంబానికీ ఏదో ఒక లబ్ధి చేకూరుతోందన్నారు. మూడేళ్లల్లో ఒక్కో కుటుంబానికి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు లబ్ధి చేకూరిందన్నారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ప్రత్యేక చొరవతో మండలంలో 3 వేల ఇళ్లు మంజూరయ్యాయన్నారు. తోపుదుర్తి చారిటబుల్ ట్రస్టు ద్వారా బోర్లు వేయిస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్ లక్ష్మీ నరసింహులు, వైస్ ఎంపీపీలు వరలక్ష్మి, రామాంజనేయులు, అగ్రి బోర్డు చైర్మన్ కేశవ రెడ్డి, ఏఓ శుభకర్, ఎంఈఓ మల్లికార్జున, హౌసింగ్ ఏఈ దేవరకొండ రామ్మూర్తి, హార్టికల్చర్ అధికారి రత్నకుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఝాన్సీ, నాగరత్న, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి

క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగు

క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగుపడతాయని ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని పలు పాఠశాలలకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యురాలు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి నియోజకవర్గంలోని 6 మండలాల్లోకి పాఠశాలలకు ఒక్కో మండలానికి రూ.45 వేలు సొంత డబ్బులతో పాఠశాలల్లో గేమ్స్ ఆడించి, వారికి బహుమతులు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీ నరసింహులు, ఎంపీడీఓ సాల్మన్, ఎంఈఓ మల్లికార్జున, వైస్ ఎంపీపీలు బోయ రామాంజనేయులు, మన్నల వరలక్ష్మి, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ నారాయణ స్వామి పాల్గొన్నారు.

ఏబీవీపీ నిరసన

అనంతపురం అర్బన్: నారాయణ కళాశాలలో ఇంటర్ విద్యార్థిని భవ్యశ్రీ ఆత్మహత్యాయత్నం ఘటనలో కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు కలెక్టరేట్ ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి చెన్నయ్య, అనంతపురం కార్యదర్శి శివతేశ్వరరెడ్డి, రాష్ట్ర నాయకుడు దివాకర్‌నాయక్ మాట్లాడారు. ఫీజు కోసం కళాశాల యాజమాన్యం వేధింపులతోనే ఆత్మహత్య యత్నం చేసిన భవ్యశ్రీ ప్రాణాపాయ స్థితిలో ఉందన్నారు. ఈ విషయంలో ఆర్ఐఓ, పోలీసులతీరు యాజమాన్యాన్ని కాపాడే ప్రయత్నం చేస్తున్నట్లుగా ఉందన్నారు. అనంతరం డీఆర్ఓ గాయత్రిదేవికి నాయకులు వినతిపత్రం అందించారు.

ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి

ఆత్మకూరు: ఆరోగ్య విషయాలపై ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని డాక్టర్ దయాకర్ సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఆశాడే నిర్వహించి, ఆరోగ్య విషయాలపై ఆశావర్కర్లకు, ఏఎన్ఎంలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ సబిహా సుల్తానా, వైద్య సిబ్బంది చంద్రావతి, నాగేశ్వరయ్య, మునాఫ్, తులసమ్మ, వెంకటరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

జీజీఎంపీ పనులు వేగవంతం చేయాలి

- నగరపాలక సంస్థ కమిషనర్ కే భాగ్యలక్ష్మి

అనంతపురం క్రైం: గడప గడపకూ మన ప్రభుత్వం నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ భాగ్యలక్ష్మి ఇంజినీర్లను ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థలో ఇంజినీర్లతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు 55 అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, మరో 50 అభివృద్ధి పనులు వివిధ దశల్లో ఉన్నట్లు ఇంజినీర్లు కమిషనర్‌కు తెలియజేశారు. నిర్మాణ దశలో ఉన్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలన్నారు. పనులు చేసే సమయంలో ఏఈ, అమినిటీ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు తప్పక అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ రమణారెడ్డి, ఈఈ రామమోహన్ రెడ్డి, డీఈలు నరసింహ, రాంప్రసాద్ రెడ్డి, శేఖర్, ఏఈలు ఉమామహేశ్వరి, బాబావలి, శంకర్ పాల్గొన్నారు.

పనితీరు మెరుగుపడాలి:

సచివాలయ సిబ్బంది పనితీరు మరింత మెరుగుపడాలని కమిషనర్ కే భాగ్యలక్ష్మి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థ నుంచి కమిషనర్ జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. పన్ను వసూళ్లు, ప్లాస్టిక్ నిషేధం, ప్రజలకందే సేవలపై ఆరా తీశారు. విధుల్లో పలువురు సిబ్బంది నిర్లక్ష్యంగా ఉన్నారని వారికి మెమోలు జారీ చేస్తున్నట్లు తెలిపారు.

మార్కెట్ వేలం పాట వాయిదా



నగరపాలక సంస్థలో వేలంపాటను నిర్వహిస్తున్న కమిషనర్ భాగ్యలక్ష్మి

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థలోని పాతూరు సంత మార్కెట్ దినసరి కూరగాయల మార్కెట్, కొత్తూరు టవర్‌క్లాక్ వద్దనున్న పాత బస్టాండ్ ప్రాంతంలో న్యూ షాపింగ్ కాంప్లెక్స్‌లో అండర్‌గ్రౌండ్‌లో సరుకుల అమ్మకంపై ఫీజు వసూలు చేసుకునేందుకు మంగళవారం వేలంపాట నిర్వహించారు. ఇందులో రాజారెడ్డి, విజయ్‌కుమార్ ఇద్దరు పాటదారులు మాత్రమే పాల్గొన్నారు. మాంసం స్టాళ్లు, చేపల మార్కెట్ స్టాళ్లు, జంతు వధశాలలో ఫీజు వసూలు హక్కును రూ.5,65,000కు లోక్‌నాథ్ రెడ్డి అనే పాటదారుడు దక్కించుకున్నాడు. ఈ నెల 10న సంత మార్కెట్‌కు మరోసారి వేలం ఉంటుందని కమిషనర్ భాగ్యలక్ష్మి తెలిపారు. ఈసారి సర్కార్‌వారి పాట రూ.90 లక్షలు నిర్ణయించడంతో పాటదారులు ముందుకు రాలేదు. కమిషనర్ సర్కారు వారి పాటను రూ.80 లక్షలకు నిర్ణయించారు. పాటదారులు సర్కార్ సవాల్ రూ.60 లక్షలు పెట్టాలని కమిషనర్‌ను పట్టుబట్టారు. అందుకుని ఒప్పుకోని కమిషనర్ వేలం వాయిదా వేశారు.

మాంసం మార్కెట్టుకు మంచి ధర:

మాంసం మార్కెట్ నిర్వహణకు మంచి ధర పలికింది. గతేడాది మాంసం మార్కెట్‌కు రూ.3.21 లక్షలు మాత్రమే పలికింది. మంగళవారం మాంసం మార్కెట్ సర్కార్ సవాల్‌ను కమిషనర్ రూ.4 లక్షలు నిర్ణయించగా, 9 మంది పాటదారుల మధ్య పోటీ జరిగింది. చివరకు లోక్‌నాథ్ రెడ్డి అనే కాంట్రాక్టర్ రూ.5,65,000 మాంసం మార్కెట్‌ను దక్కించుకున్నాడు. ఇదిలా ఉండగా చేపలమార్కెట్‌లోని వ్యాపారులు ఫీజులు చెల్లించడం లేదని, అదేవిధంగా వివిధ ప్రాంతాల్లో మాంసం విక్రయాలు చేపడుతున్న వారు ఫీజు చెల్లించకుండా ఎగరగొడుతున్నారని కమిషనర్ కే భాగ్యలక్ష్మికి ఫిర్యాదు చేశాడు. అదనపు కమిషనర్ రమణారెడ్డి, ఆర్ఓలు సత్తీష్, సుజాత, ఆర్ఐలు వేణు, మురళీ, పద్మావతి, బాబు, సూపరింటెండెంట్ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. గజగౌరీ వ్రతం



గజగౌరీ పూజలో పాల్గొన్న మహిళలు

అనంతపురం కల్చరల్: స్థానిక పాతూరు అమ్మవారి శాలలో వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గజగౌరీ పూజలు ఘనంగా జరిగాయి. సర్వవిధ పుష్పాలంకారంలో వాసవీమాతను అలంకరించి, దర్శనం చేయించారు. వేలాది మంది మహిళలు బారులు తీరి అమ్మవారి ముందు స్తోత్రాలు, కీర్తనలతో ఆరాధించారు. నిర్వాహకులు మాట్లాడుతూ స్కంధ పురాణంలో ఉన్న వ్రతాన్ని సమాజమంతటా సుఖశాంతులతో ఉండడానికి నిర్వహించామన్నారు. అనంతరం తీర్థప్రసాద వినియోగం జరిగింది. కార్యక్రమంలో వాసవీమహిళా మండలి అధ్యక్షురాలు చల్లా శ్రీస్వర్ణలత, కార్యదర్శి పాలాది పద్మజ, వంకదారు వెంకటలక్ష్మి, వివిధ ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నగర సుందరీకరణకు పెద్దపీట



సైఫుల్లా బ్రిడ్జిపై ఏర్పాటు చేసిన చిత్రాలను పరిశీలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: నగర సుందరీకరణకు పెద్దపీట వేస్తున్నట్లు మేయర్ వసీం తెలిపారు. మంగళవారం సైఫుల్లా బ్రిడ్జిపై రూ.2.50 లక్షలతో ఏర్పాటు చేసిన పెయింటింగ్‌ను మేయర్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధాన నగరాలను తలపించేలా నగరంలో సుందరీకరణపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. గోడలపై వేస్తున్న పెయింటింగ్స్‌లోనూ సందేశాత్మకత ప్రతిబింబించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మొత్తం రూ.38 లక్షలతో వాల్ పెయింటింగ్స్ వేయిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్‌నగర్ సర్కిల్ నుంచి నవోదయ కాలనీ వరకు రూ.20 లక్షలు, ఆర్టీఓ ఆఫీస్ రోడ్డు, జేఎన్‌టీయూ రోడ్డు రూ.10 లక్షలు, పాతూరులో రూ.5 లక్షలు, సైఫుల్లా బ్రిడ్జిపై రూ.2.50 లక్షలు, డీఈఓ కార్యాలయం వద్ద రూ.50 వేలతో పెయింటింగ్ పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శేఖర్‌బాబు, ఇస్హాక్, అనిలకుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ ప్రభుత్వానికి పతనమే'

అనంతపురం సిటీ: ప్రైవేటీకరణ పేరుతో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలను నిర్వీర్యం చేస్తున్న బీజేపీ ప్రభుత్వానికి పతనం తప్పదని బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు హెచ్చరించారు. అనంతపురం టవర్‌క్లాక్ సమీపంలోని బీఎస్ఎన్ఎల్ జిల్లా కార్యాలయం ఎదుట నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ టెలికాం ఎంప్లాయీస్, ఎన్ఎఫ్‌టీఈ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, సెక్రటరీ మల్లికార్జున, ట్రెజరర్ తిరుమలయ్య, ఎన్ఎఫ్‌టీఈ జిల్లా కార్యదర్శి కొండప్ప తదితరులు మాట్లాడారు. యూనియన్ మహిళా విభాగం ప్రతినిధులు నీరజ, జాస్విన్, మాధవి, సరిత, లావణ్య పాల్గొన్నారు.

ఫ్రీజర్ బాక్స్ వితరణ

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని ఫార్మసీ విభాగానికి నగరానికి చెందిన వైద్యుడు రాంప్రసాద్ మంగళవారం ఫ్రీజర్‌ను అందించారు. సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ మాట్లాడుతూ ఫ్రీజర్ వ్యాక్సిన్లను భద్రపరిచేందుకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏఓ జ్ఞానసుందరం , ఆర్ఎంఓ వైవీ రావు, ఫార్మసీ సూపర్‌వైజర్ నరసింహమూర్తి, ఈశ్వర్‌రెడ్డి, వేణుగోపాల్, కేవీఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: జాతీయ స్థాయి అండర్–14 బాస్కెట్‌బాల్ బాలికల విభాగం పోటీలకు జిల్లాకు చెందిన దీప్తి సాయి, బాలుర విభాగంలో సంజయ్‌రెడ్డి, భరత్‌సింహారెడ్డి ఎంపికయ్యారు. అలాగే అండర్–14 సాఫ్ట్‌బాల్ జాతీయస్థాయి పోటీలకు రాజేశ్వరి, వసంత, కావ్య, దీక్షిత, మహాలక్ష్మి, బాలుర విభాగంలో శశి ఎంపికయ్యారు. వీరిని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి రవికుమార్, మొరార్జీ యాదవ్, శంకరన్న, రమేష్‌లు ప్రత్యేకంగా అభినందించారు.